క్లుప్తంగా

వీడీవీకేలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు

పాచిపెంట: వీడీవీకే (వనధన్ వికాస్ కేంద్రం)లను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని వెలుగు కార్యాలయంలో సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఏడు వీడీవీకేలు ఉన్నాయని, వాటి ద్వారా గిరిజన మహిళలకు జీవనోపాధి కోసం శిక్షణ ఇప్పించాలని సూచించారు. మహిళా సంఘాలు తీసుకున్న అప్పులు కచ్చితంగా జీవనోపాధి కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఎం శివన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బుడ్డెమ్మఖర్జ గ్రామంలో రైతు పేకాపు మురళి వరి పొలంలో పంటకోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. ఎకరాకి 2,200 కిలోల ధాన్యం దిగుబడిగా వచ్చినట్లు అంచనా వేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జీవ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్ తెలిపారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్టు ఫీల్డ్ రిసోర్స్‌పర్సన్లు పి.గీత, వై.యశోద, జట్టు కో–ఆర్డినేటర్ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి..

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో అగ్నివీర్ ఉద్యోగవకాశాలపై ఎయిర్‌ఫోర్స్ సౌజన్యంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ వంటి రక్షణ రంగంలో అనేక ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. యువత వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే వైద్య, ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక రంగం, ఫార్మసీ, తదితర రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధి లెఫ్టినెంట్ సందీప్ మాట్లాడుతూ.. ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ జి.కృష్ణమోహన్, మండల ప్రత్యేకాధికారి గియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ల్యాబ్‌సేవలు



గడిచిన రెండేళ్లగా ల్యాబ్ సేవలు పెరిగాయి. రోగులకు అవసరమైన ల్యాబ్ పరీక్షలకు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా పీహెచ్‌సీలోనే అందుబాటులో ఉన్నాయి. పేదరోగులకు ఆర్థికభారం తగ్గింది. ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ



బలిజిపేట పీహెచ్‌సీలో పరీక్షల ల్యాబ్

పీహెచ్‌సీల్లో 61రకాల పరీక్షలు

- శిక్షణ పూర్తిచేసుకున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- పేదరోగులకు తగ్గిన డబ్బుల ఖర్చు

బలిజిపేట:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ సేవలు రెండేళ్ల క్రితం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు పీహెచ్‌సీల్లో అరకొరగా పరీక్షలు జరిగేవి. దీంతో రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని భావించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పీహెచ్‌సీలలో 61రకాల పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కో పీహెచ్‌సీకి బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్‌టీపీఆర్, ఆర్‌టీపీసీఆర్ వంటి యంత్ర పరికరాలు సమకూర్చారు. ఈ పరీక్షల కోసం ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు.

- గత ప్రభుత్వ నిర్ణయం మేరకే:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. రూ.5లక్షలు ఉండే ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.25లక్షలకు పెంచింది. గ్రామీణులకు వైద్య నిపుణులతో సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి గ్రామ సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహించింది. పేదలు పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని గ్రామాల్లోనే కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించింది. అదేవిధంగా పీహెచ్‌సీలలో 61రకాల ల్యాబ్ పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

ల్యాబ్‌లో చేసే పరీక్షలివే:

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్ ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్‌యూరియా, సీరం సోడియం, హెచ్ఐవీ, హెపటైటిస్–బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, వంటి 61పరీక్షలు చేస్తున్నారు. థైరాయిడ్‌కు సంబంధించిన మూడు రకాల పరీక్షలు మాత్రం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారు.

రోగులకు మేలు చేసే ప్రభుత్వం: లోగడ పీహెచ్‌సీలలో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేవి కావు. దీంతో రోగులు పీహెచ్‌సీలలో వైద్యం అంటే నరకానికి మార్గమని భావించేవారు. మందులు, ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉండేవి కావు. దీంతో చిన్నపాటి రక్తపరీక్షలు, యూరిన్ పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి డబ్బులు ఖర్చుపెట్టాల్సి వచ్చేది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పీహెచ్‌సీలలో 61రకాల ల్యాబ్ సేవలు అందుబాటులోకి రావడంతో అవసరమైన ప్రతి పరీక్ష ఇక్కడే జరుగుతోంది.

మెగా పేరేంట్స్ డేను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న మెగా పేరేంట్స్ డే సమావేశాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో స్వరూపరాణి కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం మక్కువ, శంబర జిల్లా పరిషత్‌పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మక్కువ జిల్లాపరిషత్ పాఠశాలలో జరగబోయే మెగా పేరేంట్స్ డే సమావేశానికి గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. అంతకుముందు సమావేశం ప్రాంగణంలో ఏర్పాట్లను ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణాల పరిశీలన

మండలంలోని సన్యాసిరాజపురం గ్రామానికి చెందిన రైతు మరిపి నారాయణ నిర్మిస్తున్న గోశాల షెడ్‌ను ఎంపీడీవో స్వరూపరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పనసభద్ర, వెంకటభైరిపురం, మార్కొండపుట్టి, కోన, బంగారువలస, దేవరశిర్లాం, తూరుమామిడి, సన్యాసిరాజపురం గ్రామాల్లో ఎనిమిది గోశాలు మంజూరుకాగా, గ్రౌండింగ్ పనులు పూర్తికావచ్చినట్లు తెలిపారు. మిగిలిన పనులు రైతులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఈశ్వరమ్మకు సూచించారు.

చెరకు టన్నుకు మద్దతుధర రూ 3,150



మాట్లాడుతున్న ఈఐడీ ప్యారీస్ సీనియర్ ఏవీపీ శంకర లింగం

- ఈఐడీ ప్యారీస్ సీనియర్ ఏవీపీ శంకర్ లింగం

సీతానగరం: సంకిలి ఈఐడీ ప్యారీస్ (ఇండియా)లిమిటెడ్ యాజమాన్యం 2024–25 క్రషింగ్ సీజనుకు టన్నుకు మద్దతు ధర రూ 3,150గా నిర్ధారించినదని ఈఐడీ ప్యారీస్ సీనియర్ ఏవీపీ శంకర్‌లింగం అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బూర్జలో ఉన్న చెరకు తూనిక యంత్రాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ చెరకుసాగు విస్తీర్ణాన్ని పెంచాలని, రాయితీలు ఇవ్వనున్నామన్నారు. డిసెంబర్ 5వ తేదీలోగా కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు త్వరలో జమచేస్తామని చెప్పారు. పంచదార దిగుబడి పెంచడానికి అవసరమైన చెరకు విత్తనాన్ని ఎంపిక చేసుకుని సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజరు (కేన్) మురళి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు



సీతానగరం: మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక

సీతానగరం: రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బి.విజయచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని రేపటివలసలో శుక్రవారం రెవెన్యూ సదస్సును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భూ' వివా దాలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ,మండల స్థాయిలో భూముల వివాదాలకు సంబంధించిన 22ఎ. ఫ్రీహోల్డ్, భూ ఆక్రమణల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి అవసరమైన మార్గదర్శకాలు వచ్చాయన్నారు. భూముల సమస్యలు పరిష్కరించడానికి వచ్చిన ఫిర్యాదులకు ఎటువంటి రుసుము చెల్లించ వలసిన అవసరం లేదన్నారు.ఆక్రమణలో ఉన్న భూములు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. రైతులందరూ రెవెన్యూ సదస్సులను వినియోగించు కోవాలని కోరారు. భూ సమస్య ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నూకలవాడ రెవెన్యూ సదస్సులో 19దరఖాస్తులు

బలిజిపేట: మండలంలోని నూకలవాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 19దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ రత్నకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రైతులను భూ సంబంధమైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలు ఉంటే వాటికి సంబంధించి దరఖాస్తులు ఇవ్వాలని రైతులను కోరారు. భూ సంబంధ సమస్యలకు సంబంధించి 4, కొత్త రైస్‌కార్డులకు 15దరఖాస్తులు వచ్చాయి. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారులకు తెలియజేస్తే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కె.వెంకటరమణ, ఎస్.నారాయణరావు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బలిజిపేట: దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్ రత్నకుమారి

బ్రిడ్జి పనులు మే నెలాఖరుకు పూర్తి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులు 2025 మే నెలాఖరుకు పూర్తి చేయడానికి సిద్ధం చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ డీఈ అప్పాజీ అన్నారు. సువర్ణముఖి నదిపై జరుగుతున్న పనులను క్వాలిటీ కంట్రోల్ అప్పలరాజుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ప్రారంభించిన పనులకు వినియోగిస్తున్న ముడిసరుకు నాణ్యతను పరిశీలించిన తరువాతే స్పేన్‌ల నిర్మాణం జరుగుతోందని తెలియజేశారు. ఇక్కడ చేస్తున్న పనులననుసరించి బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలకు లోబడి బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ –2047 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశాంత్ జన్ మాట్లాడుతూ.. 2047 సంవత్సరం నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ సీహెచ్ దీనకుమార్

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగాన్ని పరిచయం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అంబేడ్కర్ చూపిన దారిలో రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యతమిస్తూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా పరిపాలన సాగించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైస్ ఎంపీపీలు జగన్నాథరావు, బి.రవికుమార్, పార్టీ నేతలు మజ్జి శేఖర్, గురురాజు, గొర్లి మాధవరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సర్వేశెట్టి శ్రీనివాసరావు, వార్డుల కౌన్సిలర్‌లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బలిజిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజలు

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి

బలిజిపేట: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను బలిజిపేట మండలంలో శుక్రవారం వాడవాడలా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బలిజిపేటలో అంబేడ్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆ మహనీయుని సేవలు మరువలేనివని, బడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బలిజిపేట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.సుబ్బారావు, అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆనందరావు, కన్నారావు, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పూతే కీలకం..



బెజ్జి సమీపంలో పూతకు వచ్చిన మామిడి సాగు (ఇన్‌సెట్లో) తమ్మినేని అమరేశ్వరి

- సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఉద్యానవన శాఖాధికారులు

పాలకొండ రూరల్: పండ్లలో రారాజుగా పిలవబడుతున్న మామిడి సాగులో పూతే కీలకమని పాలకొండ ఉద్యానవన శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత శీతాకాల సీజన్‌లో మామిడి పూత ప్రారంభంకానున్న నేపథ్యంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో నాలుగువేల పైచిలుకు ఎకరాల్లో ఎక్కువగా బంగినపల్లి, కలెక్టర్, పనుకులతో పాటు ఇతర రకాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో మామిడి పూత ఆశాజనకంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి లాభసాటిగా ఉంటుందని ఉద్యానవన శాఖాధికారి టి.అమరేశ్వరి తెలిపారు. మామిడి సేద్యంలో రాత్రి సమయంలో అధిక చలి, పగలు వేడి వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో పూత, పిందెను రక్షించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు సాగుకు సంబంధించి ఆమె పలు సూచనలు చేశారు.



బద్దుమాసింగలో మామిడి తోటల సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పూత, పిందె రాలకుండా తీసుకోవాల్సిన చర్యలు..

- పూత మొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించడానికి డిసెంబర్‌లో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి చెట్లకు పిచికారీ చేయాలి.
- పూత మొగ్గలు పెరుగుదల దశలో తేలికపాటి నీటి తడులు ఇస్తే త్వరగా పిందెలు కడతాయి.
- నీటి ఎద్దడి వల్ల పోషక లోపాలు ఏర్పడడం, హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడం జరుగుతుంది. దీంతో పూత, పిందె రాలుతుందని గమనించాలి.

సస్యరక్షణ ఇలా..

తేనెమంచు పురుగు ఆశిస్తే పూతదశలో పూలు విచ్చుకోవు. దీనికి ఇమిడాక్లోప్రిడ్ మందు 0.3 ఎంఎల్ లేదా యామిథాక్సమ్ 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- తామర పురుగులు ఆశిస్తే పూత మొగ్గ దశలో డైమిథోయేట్ 2 ఎంఎల్ లేదా యామిథాక్సామ్ 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిన్న పిందె దశలో ఆశిస్తే ఫిప్రోనిల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సా కోనోజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూతపై మాడు తెగులు నివారణకు నివారణకు సాఫ్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మచ్చతెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మసి తెగులు నివారణకు గ్రాము కార్బండజిమ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బోరాన్ లోపం నివారణకు బోరాక్స్‌ను 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మొగ్గదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 3 ఎంఎల్, డైక్లోరోవాస్ 0.5 ఎంఎల్, మాంకోజెబ్ 2 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి చెట్లకు పిచికారీ చేసుకోవాలి.
- పచ్చిపూత దశలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్, డైక్లోరోవాస్ 0.5 ఎంఎల్ లేదా, మిథైల్ డెమటాన్ 2 ఎంఎల్, సాఫ్ లేదా కంపానియన్ 2 గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తెల్లపూత దశలో మందులు పిచికారీ చేయకూడదు. అవసరమైతేనే ఇమిడాక్లోప్రిడ్ 0.25 ఎంఎల్, ఆంత్రాకాల్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెలుగు క్లస్టర్ కో–ఆర్డినేటర్ తిరుపతిరావు

గరుగుబిల్లి: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు వెలుగు క్లస్టర్ కో–ఆర్డినేటర్ సీహెచ్ తిరుపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న మహిళలు వివిధ వ్యాపారాలు ప్రారంభించి, ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతీ సభ్యురాలికి రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణం మంజూరయ్యేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.